## పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

**కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ కాలనీలో 6వ ఫేజ్‌లోని పీవీఎస్ఆర్ పార్కులో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు

**బాలానగర్:** బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో వినాయకుడి గుడిలో నూతన విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కె రాజు పటేల్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం

యువకుడిపై కేసు నమోదు

**గచ్చిబౌలి:** రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్‌పై వచ్చిన యువకుడిని అడ్డుకోవడంతో ట్రాఫిక్ ఎస్ఐ చేతిలోని ట్యాబ్ లాక్కొని విధులకు ఆటంకం కల్గించడంతో అతనిపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, హోంగార్డులు గురువారం ఉదయం 11 గంటల సమయంలో శ్రీరాంనగర్ కాలనీలోని యూటర్న్ వద్ద విధులు నిర్వహిస్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన అభిషేక్ గుప్తా అనే వ్యక్తి బైక్‌ను ఆపారు. రాంగ్ రూట్‌లో వచ్చినందుకు చలానా వేయాలని ఫోన్ నెంబర్ చెప్పాలని అడగగా ఆయన పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. ట్రాఫిక్ ఎస్ఐ చేతిలోని ట్యాబ్‌ను లాక్కొని దురుసుగా ప్రవర్తించాడు. బైక్‌ను ఆపే హక్కు ట్రాఫిక్ పోలీసులకు లేదని చిందులు వేశాడు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. 43 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20.47 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం అని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, సాంబశివరావు, మంత్రిప్రగడ సత్యనారాయణ, పోతుల రాజేందర్, ఎండీ ఇబ్రహీం, కావూరి అనిల్, నాగేశ్వర రావు, మోజెశ్, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# నాలా పూడికతీత పనులు పూర్తి చేస్తాం

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** వర్షాకాలానికి ముందే నాలా పూడికతీత పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ నుంచి ఎల్లమ్మ చెరువు వరకు జరుగుతున్న ఓపెన్‌నాలా పూడికతీత పనులను ఏఈ శ్రావణితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలోనే పనులు పూర్తి చేస్తే వర్షాకాలంలో వచ్చే వరదనీరు సజావుగా దిగువకు వెళ్లిపోతుందన్నారు. లోతట్టు ప్రాంతాల వారికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. పూడికతీత పనులు సకాలంలో పూర్తి చేయాలని, వరద నీరుతో కాలనీలు ముంపునకు గురవ్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, జగదీష్, పోశెట్టి గౌడ్, రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్కులో నేలకొరిగిన వృక్షం

- వాకర్స్‌కు తప్పిన ప్రమాదం
- ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలంటున్న సందర్శకులు



బాలాజీనగర్‌లోని హుడా పార్కులో నేలకొరిగిన వృక్షం

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లోని హుడా పార్కులో ఓ వృక్షం గురువారం కుప్పకూలింది. వాకర్స్ వాకింగ్ చేసుకున్న సమయంలో ఈ వృక్షం నేలకొరగడంతో ఒక్కసారిగా వాకర్స్ ఉలిక్కిపడ్డారు. కూలే క్రమంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే పార్కులో మరిన్ని భారీ వృక్షాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. నిత్యం పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌తో పాటు వయో వృద్ధులు, చిన్నారులు, మహిళలు సందర్శిస్తుంటారు. భారీగా పెరిగిన వృక్షాలు నేలకొరిగి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాకర్స్, పార్కుకు వచ్చే సందర్శకులు భయపడుతున్నారు. చిన్నపాటి గాలి, వర్షానికే చెట్లు కూలిపోతున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎండిపోయి, కూలిపోయే స్థితిలో ఉన్న చెట్లను తొలగించాలని వాకర్స్ కోరుతున్నారు. గత వర్షాకాలంలో కూడా ఇటువంటి వృక్షాలు పలు పార్కుల్లో నేలకొరగడంతో కరెంటు స్తంభాలు కూలిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించి, ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## నాలాలో చెత్తా చెదారాన్ని తొలగించాలి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

**మోతీనగర్:** నాలాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, సర్దార్‌నగర్‌లలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బలరాం, జలమండలి అధికారులు అన్విత్, జాకీర్‌లతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలాలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, ముత్యాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**బాలానగర్:** అమృత్‌నగర్ తండా వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ కోరారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు తండా వాసులతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలో నివసిస్తున్న 130 కుటుంబాలకు వారిలో 65 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించిందని తెలిపారు. అనంతరం నూతన ప్రభుత్వం ఇళ్లను కేటాయించకపోవటంతో మిగిలిన వారు నాలా పక్కన ఉండడంతో అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో వారికి కైత్లాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ నాయక్, మోత్యా నాయక్, పీటర్ నాయక్, గంసు భాయ్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమించిన అమ్మాయి దక్కలేదని..

- ఆమె భర్తను హత్య చేసిన యువకుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడు పవన్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

**కేపీహెచ్‌బీకాలనీ:** ప్రేమించిన అమ్మాయి దక్కలేదనే కోపంతో ఆ అమ్మాయి భర్తను హత్యచేసిన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారంఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ శ్రీనివాసరావు, సిఐ రాజశేఖర్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. కాకినాడకు చెందిన పంపేన అయ్యప్పస్వామి అలియాస్ పవన్ (27) చిన్నప్పుడే తల్లిచనిపోవంతో మేనత్త ఇంటి వద్ద పెరిగాడు. ఈ సమయంలో శ్రావణి సంధ్య అనే అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాని పెళ్లి చేసుకుంటానని వాళ్ల తల్లిదండ్రులకు బంధువులతో అడిగించాడు. అతడి ప్రవర్తన నచ్చక వివాహం చేసేందుకు అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ అమ్మాయిని రాజమండ్రి దగ్గరలోని కోరుకొండ మండలం, ములగాడు గ్రామానికి చెందిన కాళ్ల వెంకటరమణకు ఇచ్చి వివాహం చేశారు. అనంతరం వారు బతుకు తెరువు కోసం భగత్‌సింగ్ నగర్‌ఫేస్–1లో నివాసముంటున్నారు. ఇటీవల తన సోదరీతో కలిసి శ్రావణి సంధ్య రాజమండ్రికి వివాహ కార్యక్రమానికి వెళ్లగా అక్కడ పవన్ ఆ అమ్మాయిని చూశాడు. ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలంటే ఆమె భర్తను చంపాలని పవన్ పథకం వేసి ఆ అమ్మాయి నివాసముండే సమీపంలో మకాం మార్చాడు. తరచూ ఆ ఇంటి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఇబ్బంది పెట్టేవాడు. ఈ క్రమంలో ఈ నెల10న అర్ధరాత్రి వెంకటరమణ తన తోడల్లుడు దుర్గాప్రసాద్‌తో ఇంట్లో బంధువులతో కలిసి ఉండగా పవన్ వచ్చి గొడవ పడ్డాడు. వెంకటరమణను హత్య చేసేందుకు పవన్ తన స్నేహితులైన గుప్పల శివరామకృష్ణ (20), రాజమహేంద్రవరం అనిల్ (19), నంబిగారి సాయికుమార్(20), మరో బాలుడిని కలిసి వచ్చి వెంకటరమణ గుండెల్లో కత్తితో పొడవగా అక్కడికక్కడే వెంకట రమణ మృతి చెందాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు గుబ్బల శివరామకృష్ణ, రాజమహేంద్రవరం అనిల్, నంబిగారి సాయికుమార్‌ను అరెస్టు చేయగా బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ప్రధాన నిందితుడు అయ్యప్పస్వామి అలియాస్ పవన్‌న్ పరారీలో ఉండగా గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు.

## రేపటి నుంచి శృంగేరి శారదా శంకరమఠం వేడుకలు

**మోతీనగర్:** మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠం 26వ వార్షికోత్సవ కార్యక్రమాలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు గురువందనం, గురుపాదుకా పూజ, కలశ స్థాపన, 10 గంటలకు రుద్ర హోమం, సాయంత్రం 6 గంటలకు గానామృత తరంగిణి వారిచే శ్రీ భారతీ తీర్థ విరచిత శ్రీ శారదా పంచరత్న స్తుతి, 6:30 గంటలకు బ్రహ్మశ్రీ చిర్రావూరి శివరామకృష్ణశర్మచే లీలాశుక విరచిత శ్రీకృష్ణకర్ణామృతం ప్రవచనం, ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ లలితా హోమం, సాయంత్రం 6 గంటలకు పద్మా హేమమాలిని ఆధ్వర్యంలో నవావరణ కీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శన, సోమవారం ఉదయం 7 గంటలకు శ్రీ శారదా చంద్రమౌళీశ్వరులకు మహాన్యాస పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం 7 గంటలకు శ్రీ శారదా అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు శ్రీ శృంగేరి శంకరమఠం ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

# అక్రమ నిర్మాణం!

- పట్టించుకోని అధికారులు



ట్యాంక్ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న షాపులు

**ఆల్విన్‌కాలనీ:** కూకట్‌పల్లి, దీనబంధు కాలనీ నాలా బ్రిడ్జికి ఆనుకుని ఉన్న సెప్టిక్ టాంక్ స్థలాన్ని కబ్జా చేసి కమర్షియల్ నిర్మాణం చేపడుతున్నారు. కాలనీ నిర్మాణ సమయంలో కాలనీ నివాసుల అవసరం నిమిత్తం సెప్టిక్ ట్యాంక్ నిర్మించారు. కాలక్రమేణా కాలనీ పెరగడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రావటంతో సెప్టిక్ ట్యాంక్ ఉపయోగంలో లేదు. రెండు దశాబ్దాల క్రితం నాయకుల ఫిర్యాదుతో నాడు చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారు. అదే సెప్టిక్ ట్యాంక్ స్థలంలో ప్రస్తుతం తిరిగి కబ్జాదారుడు నిర్మాణం చేపట్టాడు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ స్థలంలో నిర్మాణాలను పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఉడాయించిన బంగారు నగల వ్యాపారి

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- రూ.10 కోట్ల విలువ చేసే బంగారంతో పరార్



నిందితుడు నితీష్ జైన్

**కేపీహెచ్‌బీ/నిజాంపేట్:** బాచుపల్లి ప్రగతినగర్‌లో బంగారం వ్యాపారం నిర్వహిస్తూ నమ్మించి డబ్బులు వసూలు చేసి ఉడాయించిన మోసగాడి బాగోతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. గురువారం ఇద్దరు వ్యాపారులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాధ రాణి అనే మహిళ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. అశోక్ కుమార్ జైన్ అనే వ్యక్తి 30 ఏళ్లుగా కేపీహెచ్‌బీ కాలనీలో రిషబ్ జువెల్లరీ పేరుతో బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. ప్రగతినగర్‌లో చేతన్ జువెల్లరీ పేరుతో వ్యాపారం చేస్తున్న నితీష్ జైన్ నాలుగేళ్లుగా అశోక్ కుమార్ జైన్ వద్ద బంగారం తీసుకుని వ్యాపారం చేసేవాడు. గత నెల 8న, ఈ నెల 10న నితేష్ జైన్ అతని భార్య స్వీటీ జైన్‌లు అశోక్ కుమార్ నగల షాపుకు వచ్చి రెండుమార్లు సుమారు అరకేజీ బంగారు నగలును తీసుకున్నారు. డబ్బులు త్వరలో చెల్లిస్తామని నమ్మబలికి వెళ్లిపోయారు. ఎప్పుడు డబ్బులు అడిగినా త్వరలోనే ఇస్తామని నమ్మబలికేవారు. ఇదే కోవలో ఐడీపీఎల్ కాలనీలోనీ దీపక్ జైన్‌కు చెందిన జ్యోతి జువెల్లరీలోనూ సుమారు 860 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకొని నెలరోజుల్లో డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికారు. అయితే ఈ నెల 10 నుంచి ప్రగతినగర్‌లోని నితీష్ జైన్‌కు చెందిన చేతన్ జువెల్లరీ దుకాణాన్ని తెరవకపోవడంతో అతనికి బంగారం ఇచ్చిన వ్యాపారులు, బంగారం కుదువపెట్టిన వారు, వివిధ స్కీంల పేరుతో డబ్బులు కట్టినవారు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ, ఐడీపీఎల్ కాలనీలకు చెందిన ఇద్దరు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విషవాయువులతో.. ఉక్కిరిబిక్కిరి



బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని ప్రజలు ఈ ప్రాంతంలో ఇల్లు కొనుక్కుని నివసిస్తున్నారు. కానీ బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల నుంచి ప్రతి నిత్యం వెలువడుతున్న విష వాయువులతో కంటిమీద కునుకులేకుండా స్థానిక ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. విష వాయువులను వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం కౌన్సిల్‌లో ఈ సమస్యను లేవనెత్తి ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్లారు.

- వివిధ రూపాల్లో స్థానికుల నిరసన
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యంతో బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల ప్రజలు

**నిజాంపేట్:** బాచుపల్లి, మల్లంపేట్ ప్రాంతాలను ఆనుకుని ఉన్న బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లో ఉన్న పలు పరిశ్రమల నుంచి విష వాయువులు వాతావరణంలో కలుస్తున్నాయి. పరిశ్రమల నుంచి విష వాయువులు వెలువడుతుండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ విష వాయువులను వదులుతుండటంతో ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఈ సమస్యతో తీవ్రంగా సతమతమవుతున్నారు.

**పెద్ద ఎత్తున పోరాటాలు**

పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులను అరికట్టాలని కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు వేలాది మంది పలుమార్లు నిరసన చేపట్టారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య తీవ్రతను వివరించారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కోర్టును సైతం ఆశ్రయించారు. బాచుపల్లి, మల్లంపేట్, భౌరంపేట్, నిజాంపేట్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో అనేక విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో వేలాది మంది విద్యార్థులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే విష వాయువులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారుల తనిఖీలేవి?**

పారిశ్రామికవాడలో తనిఖీలు చేయాల్సిన అధికారులు యాజమాన్యాలు ఇచ్చే మూముళ్ల మత్తులో పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల సమయంలో నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని పలువురు పేర్కొన్నారు. అనంతరం రెండు, మూడు రోజుల తరువాత ఈ సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్న చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.




విషవాయువులను అరికట్టాలని నిరసన తెలుపుతున్న స్థానికులు (ఫైల్)

### అధికారులు మొద్దు నిద్ర వీడాలి



ప్రజలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటుంటే పీసీబీ అధికారులు మాత్రం మొద్దు నిద్ర పోతున్నారు. ప్రజల ప్రాణాలంటే అధికారులకు ఇంత చులకనగా కనిపిస్తున్నాయా?. వేలాది మంది విద్యావంతులు, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి సమస్య తీవ్రతపై నిరసన చేపట్టినా పీసీబీ అధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరం. అధికారులు తమ తీరు మార్చుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

– విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్.

### ఇక్కడ బతకలేకపోతున్నాం



పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులతో ఇక్కడ బ్రతకలేకపోతున్నాం. స్వచ్ఛమైన గాలి కూడా పీల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. విషవాయువులతో సాయంత్రం, తెల్లవారుజామున బయటకు వెళ్లలేక పోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు.

– రాజేశ్, మల్లంపేట్

## ఆలయ అభివృద్ధికి కృషి



**మోతీనగర్:** షిరిడీ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు అన్నారు. సాయిబాబా ఆలయ ఆవరణలో దివంగత బి. నర్సింలు సతీమణి బాలమణి కుమారులు అభిషేక్, నిఖిలేష్ నర్సింలు నర్సింలు జ్ఞాపకార్థం ఆలయ ఆవరణలో నిర్మించిన దునిని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి పాల్గొన్నారు.

## 'సండే ఈవినింగ్ టాక్'

**రాయదుర్గం:** బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్'కు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'కాన్షియస్ లివింగ్ ఫర్ స్టిల్‌నెస్ విథిన్' అనే అంశంపై ముంబాయికి చెందిన స్పిరిచ్యువల్ ఆదర్, కోచ్, ఫెసిలిటేటర్ బికె రీతు తక్కర్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.